అర్హులందరికీ న్యాయం చేసేందుకే 'జగనన్న సురక్ష'

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: అర్హత ఉన్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు బోరవానిపాలెం సచివాలయంలో లబ్ధిదారులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా నవరత్నాలతో పాటు అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఏ కారణం చేతనైనా అర్హులకు అన్యాయం జరిగితే సరిచేసి, వారికి తక్షణమే లబ్ధి చేకూరేలా చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అదేవిధంగా రోజూ వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మాజీ మంత్రి బాలరాజు మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం ఆలోచించే ముఖ్యమంత్రి దొరకడం మన అదృష్టమన్నారు. తహసీల్దార్ రమణయ్య, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పోతిన హనుమంతు, కన్వీనర్లు పోతిన సురేష్, ముచ్చు రామారావు, బోయి సూరెడ్డి, బోయి శ్రీను, వాండ్రాసి రవికుమార్, లోహిత్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష... ప్రజలకు శ్రీరామరక్ష

ఆనందపురం : అర్హులై ఉండి, ప్రభుత్వ పథకాలు అందకుండా ఉన్న వారి ప్రయోజనార్థం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు శ్రీరామరక్షగా మారిందని వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ అన్నారు. ఆనందపురం, లొడగలవానిపాలెం గ్రామాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు సచివాలయాలకు సంబంధించి సుమారు మూడు వందల మందికి కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్స్, కౌలు కార్డులు, రేషన్ కార్డులలో చేర్పులు, మార్పులు వంటి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సత్యపద్మ, తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ కరుణాకరరావు, సర్పంచ్‌లు చందక లక్ష్మి, లొడగల రాజేశ్వరి, నాయకులు మజ్జి వెంకటరావు, పాండ్రంకి అప్పారావు, లొడగల రమణ, చందక సూరిబాబు, రౌతు వెంకటరావు, కార్యదర్శులు శ్రీరామమూర్తి, అనురాధ పాల్గొన్నారు.



ఆనందపురంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

తగరపువలస: చిట్టివలసలో జగనన్న సురక్ష క్యాంపులో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు 865 మందికి వివిధ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని విధంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందాలనే జగనన్న సురక్ష ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఇప్పటికే 99 శాతం మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అక్కరమాని పద్మ, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, అక్కరమాని రామునాయుడు, శిల్లా కరుణాకరరెడ్డి, జీరు వెంకటరెడ్డి, జీరు సుజాత, డబ్బీరు ప్రశాంతి, జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాజీ మంత్రి బాలరాజు

• తాళ్లవలసలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆర్డీవో పి.భాస్కరరెడ్డి, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఎంపీపీ దంతులూరి వాసురాజు, నాయకులు బోని సన్నిబాబు, సింగపూర్ బుజ్జిరాజు, చిల్ల హరి, అక్కరమాని అప్పలనాయుడు, దంతులూరి వేణురాజు పాల్గొన్నారు.



తాళ్లవలసలో పత్రాలు అందిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు

సురక్ష క్యాంపులు వినియోగించుకోవాలి

మధురవాడ: అర్హులందరికీ పథకాలు అందించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని విశాఖ రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్య సూచించారు. జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో 75వ నంబరు సచివాలయం, 78వ నంబరు సచివాలయాల వద్ద సురక్ష క్యాంపులు శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, ఆర్ఐ మల్లేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి పోతిన సురేష్ కుమార్, సచివాలయాలు ఇన్‌చార్జ్‌లు జేఎస్‌రెడ్డి, రుషికేష్, టి.ప్రసాద్, సుజాత, రమణమ్మ, కామేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 35, 75, 78వ నంబరు సచివాలయాల్లో 1,273 మంది దరఖాస్తు చేసుకోగా... 1,095 పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా 905 మందికి కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.



సురక్ష క్యాంపులో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణయ్య

24 గంటల్లో పరిష్కరించారు



కుల ధ్రువీకరణ పత్రం కోసం కొన్నేళ్లుగా సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాలేదు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో మా చేతికి అందజేశారు. – **పద్మావతి**, మారికవలస

సమస్య పరిష్కరించారు



పెళ్లై ఏడాది అవుతోంది. అప్పటి నుంచి మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం కాళ్లు అరిగేలా తిరిగాం. వలంటీర్ మా ఇంటికి వచ్చి జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకోమంటే చేశాం. రెండు రోజుల్లోనే మ్యారేజ్ సర్టిఫికెట్ మా చేతికి అందించారు. – **పట్నాన వసంత**, నగరపాలెం

సమస్యలన్నీ తీరాయి



కూలి పని చేసుకుంటూ ఒంటరిగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. భర్త చనిపోయారు. పిల్లలు, బంధువులు ఎవరూ లేరు. ఆధార్ కార్డు సమస్య వల్ల ఇంత వరకు ఏ పథకమూ అందలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు, వలంటీర్లు ఇంటికి వచ్చి నా సమస్య తెలుసుకొని ఆధార్‌కార్డు వివరాలు సరి చేసి వెంటనే రైస్‌కార్డు ఇచ్చారు. దాంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కూడా ఇచ్చారు. వాటితో తొందరలోనే పింఛను ఇస్తామని చెప్పారు. జగన్ బాబు దయతో నాకు ఇక ఇబ్బందులు ఉండవు. – **తమ్మిన లక్ష్మి**, ఆనందపురం

ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు



భర్తతో కలిసి పదేళ్ల క్రితం ఆరిలోవ నుంచి ఉపాధి కోసం ఆనందపురం వలస వచ్చాము. పిల్లలు లేరు. రైస్ కార్డు ఉన్నా భర్త మరణ ధ్రువీకరణ పత్రం లేదని ఇంత వరకు వితంతు పింఛను కూడా మంజూరు చేయలేదు. ఈ విషయాన్ని జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలపగా, వివరాలు తీసుకొని నా భర్త మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పింఛను కోసం అధికారులే దరఖాస్తు చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల ఇన్నాళ్లకు నా కష్టాలు ఒడ్డెక్కాయి. – **తోట సరస్వతి**, ఆనందపురం

చాలా మంచి కార్యక్రమం



ఏదైనా సర్టిఫికెట్ తీసుకోవాలన్నా, పథకాలు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా చాలా సమయం పట్టేది. ప్రస్తుతం ఇంటి దగ్గరకే తెచ్చి సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ఇది చాలా మంచి కార్యక్రమం. గతంలో ఎమ్మార్వో ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. గత ప్రభుత్వానికి, ఇప్పటికీ వంద రెట్లు మార్పు వచ్చింది. – **వారణాసి శ్రీదేవి**, ఆర్‌జీకే కాలనీ, మారికవలస

క్లుప్తంగా

మాజీ కౌన్సిలర్ సీమయ్య మృతికి సంతాపం



నమ్మి సీమయ్య (ఫైల్)

తగరపువలస: భీమిలి మున్సిపాల్టీ మాజీ కౌన్సిలర్ నమ్మి సీమయ్య (94) వృద్ధాప్యం కారణంగా శనివారం సంగివలసలోని తన ఇంటి వద్ద మృతి చెందారు. సంగివలస భీమిలి మున్సిపాల్టీలో విలీనమైన తర్వాత వరుసగా 20 ఏళ్లు కౌన్సిలర్‌గా, పదేళ్ల పాటు తగరపువలస పీఏసీఎస్ డైరెక్టర్‌గా పని చేశారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించేవారు. ఈయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆనందపురం : మండలంలోని బోయిపాలెం బ్రిడ్జి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్టు ఎస్ఐ శ్యామ్ సుందర్ తెలిపారు. తెల్లటి గడుల చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని, వయస్సు సుమారు 70 ఏళ్లు ఉండొచ్చని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

మహిళలకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చినజీయర్ స్వామి వారి వికాస్ తరంగిణి ఆరోగ్య వికాస్ సహకారంతో రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు శనివారం నిర్వహించారు. ఆంకాలజిస్టులు లీల, జ్యోతి ఇక్కడకు వచ్చిన మహిళలను పరీక్షించి సూచనలు అందించారు. ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, సభ్యులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.భానోజీరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పీఎం పాలెం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం 8వ వార్డులోని బింద్రానగర్ ధర్మపురికాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అవినీతికి తావు లేదన్నారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు జగనన్న పాలనపై సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్ రావాలంటే ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించుకోవాలని స్థానిక నాయకులు పిలుపునిచ్చారు. జెడ్సీ కనక మహాలక్ష్మి, 7, 8 వార్డుల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, గుడ్ల పోలిరెడ్డి, సింహాచలం ట్రస్టు బోర్డు సభ్యురాలు రాజేశ్వరి, నాయకులు లొడగల రామ్మోహన్, గోపి పాల్గొన్నారు.

భూమి అప్పగించాలని ఆందోళన

పద్మనాభం: పూర్వీకుల నుంచి సాగు చేసుకుంటున్న భూమిని తమకు అప్పగించాలని మండలంలోని పాండ్రంగి పంచాయతీ బర్లపేటలో పలువురు శనివారం ధర్నా చేశారు. సర్వే నంబర్ 42/1, 41/2లోని కల్లాలు, నూర్పులకు ఉపయోగించుకుంటున్న పది ఎకరాల భూమికి రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు నమోదై ఉన్నాయని బర్లపేట వాసులు తెలిపారు. అయితే తమ తల్లిదండ్రులు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందున ఆ భూమిని తమకిచ్చారని రూపాకుల రవి కుమార్ రాజకీయ పలుకుబడి ఉపయోగించి పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాండ్రంగి సర్పంచ్ పల్లి ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు పల్లి మహేష్, అముజూరి అప్పారావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ కొరడా

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లో అక్రమ కట్టడాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కొరడా ఝుళిపించారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందం అన్ని జోన్లలో కలిపి 176 అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ప్రాథమికంగా అందులో అయిదు వరకు భీమిలి జోన్‌లో ఉన్నాయి. వీటిలో టౌన్ ప్లానింగ్ అనుమతి లేకుండా అదనపు అంతస్తుల నిర్మాణం, 200 గజాలు దాటిన నిర్మాణాల్లో సెట్ బ్యాక్ వదలనివి, రోడ్డు మార్జిన్‌లు దాటి చేపట్టిన నిర్మాణాలు ఉన్నాయి. వీటిని సిబ్బంది సాయంతో శనివారం తొలగించారు. ఈ సందర్భంగా భీమిలి జోన్ ఏసీపీ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీ కమిషనర్ ఆదేశాలతో అక్రమ కట్టడాలను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీపీవో మూర్తిశ్రీ,, సిబ్బంది గణేష్, లక్ష్మీనారాయణ, టౌన్ ప్లానింగ్ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



సంతపేట గొల్లవీధిలో అక్రమంగా నిర్మించిన అంతస్తును కూలుస్తున్న అధికారులు

త్వరలో తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్

తగరపువలస: త్వరలో తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి భీమిలి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చిల్లపేట చెరువు వద్ద 25 ఎకరాల్లో గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ పనులకు సంబంధించి రూ.6.50 కోట్లతో చేపట్టనున్న పథకానికి శిలాఫలకం శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న చెరువు సమస్య మూడు మాసాల్లో తీరుతుందన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ కూడా పూర్తి చేసి ఏడాదిలోగా తిరిగి ఇదే నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలు అందిస్తానన్నారు. చెరువులోకి అనిట్స్ ఆస్పత్రి నుంచి వస్తున్న వ్యర్థాలు కలవకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇక్కడ సర్వే చేసి ప్రభుత్వ భూమిని రక్షించాలని కోరారు. నాలుగేళ్లలో నాలుగు మాటలు మార్చిన చంద్రబాబు పక్క రాష్ట్రాల్లోని మేనిఫెస్టోను కాపీ కొట్టి అభాసుపాలవడం ఖాయమన్నారు. అక్కరమాని పద్మ, కొప్పల ప్రభావతి, శిల్లా సరళారాణి, చిల్ల భాస్కరరెడ్డి, జీరు సుజాత, శిల్లా కరుణాకర రెడ్డి, జగుపల్లి ప్రసాద్, అల్లిపల్లి నరసింగరావు, అక్కరమాని రామునాయుడు, జీరు వెంకట రెడ్డి, చిప్పాడ వెంకటేష్, శిల్లా వంశీరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిల్ల ప్రమీల, డబ్బీరు ప్రశాంతి, మునకాల ఆదినారాయణ రెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, కదిరి ఎల్లాజీ, గుండాసి మధు తదితరులు పాల్గొన్నారు.



బ్యూటిఫికేషన్ పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పద్మనాభం: అందరూ ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని ఎంఈవో – 2 బాబూలాల్ కోరారు. తునివలస ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్ సమకూర్చిన నోట్స్, కాపీ రైటింగ్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, కిలారి సూర్యనారాయణతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబూలాల్ మాట్లాడుతూ పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. బదిలీపై వెళ్లిన నర్సింగారావును సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్ కుమార్, హెచ్ఎం జానకీరామ్ నాయుడు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో - 2 బాబూలాల్, నాయకులు

ముగిసిన మహిళల టెన్నిస్ టోర్నీ



ట్రోఫీ, సర్టిఫికెట్లతో విజేతలు, నిర్వాహకులు

తగరపువలస: చిట్టివలస మెడోస్ స్పోర్ట్స్ విలేజ్‌లో ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 26న ప్రారంభించిన డాక్టర్ ఎస్.ఝాన్సీ లక్ష్మి మెమోరియల్ మహిళల టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ టోర్నీ సింగిల్స్‌లో తమిళనాడుకు చెందిన లక్ష్మీప్రభ విన్నర్‌గా, ఆంధ్రాకు చెందిన హర్షిణి రన్నర్‌గా నిలిచారు. అలాగే డబుల్స్‌లో ఆంధ్రాకు చెందిన శర్వాణీ, హర్షిణి విన్నర్స్‌గా, ఆంధ్రాకు చెందిన చందన, తమిళనాడుకు చెందిన ఆర్తీ మునియన్ రన్నర్స్‌గా నిలిచారు. వీరికి టోర్నమెంట్ డైరెక్టర్ చల్లారపు శ్రీనివాసరావు, రిఫరీ మరడ శివకుమార్ రూ.లక్ష నగదు, బహుమతులతోపాటు ట్రోఫీ, సర్టిఫికెట్లు అందించారు.

పాలిథిన్ విక్రయిస్తున్న టీ వ్యాపారికి రూ.15 వేల జరిమానా

తగరపువలస: స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లోని వ్యాపారులకు హోల్‌సేల్, రీటైల్‌గా పాలిథిన్ సంచులు విక్రయిస్తున్న పిడుగు అప్పారావు అనే వ్యక్తి నుంచి శనివారం భీమిలి జోన్ శానిటేషన్ అధికారులు 10 కిలోల కవర్లు స్వాధీనం చేసుకున్నారు. కొంత కాలంగా నిఘా పెట్టిన శానిటేషన్ కార్యదర్శులు ఎట్టకేలకు పట్టుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ అప్పారావుకు రూ.15వేల జరిమానా విధించినట్టు తెలిపారు.

ఉమ్మడి సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని వినతి

మధురవాడ: ఉమ్మడి సీనియార్టీ ప్రకారం ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని మధురవాడలోని ఆర్‌జేడీ కార్యాలయంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శ్రీరామమూర్తికి పీఆర్‌టీయూ నాయకులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీను, గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తుస్సుమన్న టీడీపీ బస్సుయాత్ర

కొమ్మాది: టీడీపీ బస్సుయాత్ర జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దుర్గాలమ్మ గుడి వద్ద శనివారం తుస్సుమంది. జనాలు లేక వెలవెలబోయింది. వాస్తవానికి గుడి ఎదురుగా ఉదయం 9 గంటలకు బహిరంగ సభ ఏర్పాటు చేసి, 10 గంటలకు రుషికొండ, ఐటీ సెజ్ పరిశీలించేందుకు నాయకులు బస్సుపై వెళ్లాల్సి ఉంది అయితే జనాలు లేక సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలు అన్నీ ఖాళీగా కనిపించడంతో భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజబాబు అవాక్కయ్యారు. హుటాహుటిని 5, 6, 7వ వార్డుల నుంచి ఆటోల్లో జన సమీకరణ చేసి 12 గంటలకు సభ ప్రారంభించారు. అయితే ఇక్కడకు వచ్చిన వారికి కనీసం నీరు అందించకపోవడం, మూడు గంటలు ఆలస్యం కావడంతో కార్యకర్తలు అసహనానికి గురయ్యారు. ఈ సభ అంతా కేవలం వైఎస్సార్ సీపీని విమర్శించేందుకు తప్ప, టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తారో చెప్పలేకపోవడం గమనార్హం. సభ పూర్తయిన తర్వాత మాజీ మంత్రులు కళా వెంకటరావు, బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జి, పలువురు నేతలు రుషికొండ కొండపై జరుగుతున్న పనులను పరిశీలించేందుకు వెళ్లగా పోలీసులు అనుమతి లేనందున అడ్డుకున్నారు. అక్కడ నాయకులు కాసేపు బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి ఐటీ సెజ్‌కు పయనమయ్యారు.



జనాలు లేక వెలవెలబోతున్న కుర్చీలు

కనిపించని జిల్లా నాయకులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో శనివారం చేపట్టిన టీడీపీ బస్సు యాత్రలో భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో జిల్లా నాయకులు కనిపించలేదు. స్థానికులు కూడా ఈ యాత్రపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో చప్పగా సాగింది. బయట నుంచి వచ్చిన కార్యకర్తలు మాత్రమే కనిపించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు విషయంలో టీడీపీని వ్యతిరేకించి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పంచన చేరిన టీఎన్‌టీయూసీ నాయకులు బలవంతంగా మిల్లు వద్ద సెల్ఫీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ కూడలిలో చేనేత కార్మికుడు గిడుతూరి శ్రీనివాసరావు సైకిల్ పోవాలి అంటూ బిగ్గరగా అరవడంతో టీడీపీ కార్యకర్తలు విస్తుపోయారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య విభేదాల కారణంగానే ఎవరూ ఈ యాత్రవైపు దృష్టి సారించనట్టు తెలుస్తోంది.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల్లో గల గర్భిణుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు ఆదేశించారు. మండలంలోని తర్లువాడ, గొట్టిపల్లి వెల్‌నెస్ సెంటర్లను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ డాక్టర్ విధానంపై చర్చించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోషకాహార లోపాలు తలెత్తకుండా వైద్య సిబ్బంది సలహాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో రామిరెడ్డి, ఈవోపీ నాగభూషణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు షహనాజ్ సాదియా, ఎంఎల్‌హెచ్‌పీలు మానస, స్వర్ణలత, 104 సిబ్బంది జ్ఞానేశ్వర్, భాస్కరరావు పాల్గొన్నారు.

తర్లువాడలో ర్యాలీ

ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో తర్లువాడలో డెంగ్యూ నివారణ మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారి నుంచి రక్షించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యాధికారి షహనాజ్ సాదియా, ఆరోగ్యాధికారి సాంబమూర్తి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



గొట్టిపల్లి వెల్‌నెస్ సెంటర్‌లో బాలింతతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఘనంగా వైద్యుల దినోత్సవం

పీఎం పాలెం : విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన డాక్టర్ బి.శ్రీనివాస్, డాక్టర్ పి.కార్తీక్‌ను డాక్టర్స్ డేను పురస్కరించుకుని పీఎం పాలెంలోని తులసీనగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ గాదె రోశిరెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి వైద్య సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రెసిడెంట్ కేవీఎస్‌వీ బ్రహ్మాజీ, కార్యదర్శి ఎ.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




వైద్యులను సత్కరిస్తున్న తులసీనగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శనివారం వైద్యుల దినోత్సవం సూపరింటెండెంట్ ఫణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండడంతో రోగులకు ఎంతో సదుపాయంగా ఉందన్నారు. ఫణికుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇక్కడ సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్యులను నాయకులు సత్కరించారు.

సమతుల్య ఎరువులతో అధిక దిగుబడులు

పద్మనాభం: రైతులు సమతుల్య ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ పి.వి.కె.జగన్నాథరావు సూచించారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వాతావరణం – పంటలపై ప్రభావం అనే అంశంపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథరావు మాట్లాడుతూ విచక్షణారహితంగా రసాయన ఎరువులు వేయకూడదన్నారు. భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయ ప్రసాద్, జీకేఎంఎస్ నోడల్ ఆఫీసర్ కె.వి.రమణమూర్తి, డాక్టర్ ఎంబీజీఎస్ కుమారి, డాక్టర్ చంద్రశేఖర్, తాలాడ సూరినాయుడు, డాక్టర్ లీలవేణి, ఎంపీఎస్ చలం, సంధ్య రత్న ప్రభ, శివకోమలి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జగన్నాథరావు

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ

భీమునిపట్నం: భీమిలిలోని మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద నేషనల్ ఫిషరీస్ బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) సహకారంతో నిర్వహించిన శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి లావణ్య మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో తమను ఎలా కాపాడుకోవాలి.., తోటివారిని ఎలా రక్షించాలన్న దానిపై ఎంపిక చేసిన మత్స్యకారులకు శిక్షణ అందించామన్నారు. వీరంతా తమ ప్రాంతంలోని ఇతర మత్స్యకారులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్లు కొండలరావు, తేజ పాల్గొన్నారు.